# పాపపు ఒప్పుకోలు ప్రార్థన - 02

యేసయ్య! నా పాప పరిహారార్ధ నిమిత్తము
శ్రమనొంది బాధింపబడ్డావు,
దౌర్జన్యమునొంది, అన్యాయపు తీర్పు నొందినవాడవై
శిక్షను అనుభవించావు.
అందును బట్టి నీకే స్తుతులు, స్తోత్రములు, వందనములు.

పరిశుద్ధుడవైన మా తండ్రీ, ప్రేమగల మా రక్షకా!
నీకు స్తుతులు, స్తోత్రములు.
ఈ లోక ప్రజలెవ్వరూ నశించిపోకుండా ఉండాలని
అందరు రక్షణ పొందాలని మాపట్ల మీకున్న దయాసంకల్పమును బట్టి
మీకు కృతజ్ఞతాస్తుతులు, స్తోత్రములు.

దేవా! నేను ఘోర పాపిని; నా జీవితంలో తెలిసి తెలియక
ఎన్నో పాపములను చేసియున్నాను.
యేసయ్య! నన్ను క్షమించండి.
ప్రభువైన దేవా! నీకు విరోధముగాను,
నీ సంఘమునకు విరోధముగాను,
నీ పరిచర్యకు విరోధముగాను,
నీవు ఏర్పరచుకొన్న మీ సేవకులకు విరోధముగాను
ఎన్నో మారులు గర్వంతోను, అజ్ఞానంతోను, అసూయతోను
ఎన్నో తప్పుడు మాటలను మాట్లాడియున్నాను.
యేసయ్యా, దయచేసి నన్ను క్షమించండి.
ప్రభువైన దేవా!
నాలో ఉన్న మూర్ఖత్వాన్ని, గర్వాన్ని తీసివేయండి.
దీన మనస్సును నాకు ప్రసాదించండి.
అజ్ఞానంతో నీ రాజ్యమునకు విరోధముగాను,
మీ వాక్యమునకు వీరోధముగాను ప్రవర్తించియున్నాను.
మాటలద్వారాను, క్రియలద్వారాను, చూపులద్వారాను,
తలంపుల ద్వారాను అనేక పాపములు చేసియున్నాను.
నా దోషములు బహువిస్తారమైనవి.

దేవా! నీ కృప చొప్పున నన్ను కరుణింపుము.
నీ వాత్సల్య బహుల్యళ్యముచొప్పున
నా అతిక్రమములను తుడిచి వేయుము.
నా దోషము పోవునట్లు నన్ను బాగుగా కడుగుము.
నా పాపము పోవునట్లు నన్ను పవిత్రపరుచుము.
నేను పవిత్రడగునట్లు నీ రక్తముతో నా పాపము పరిహారింపుము.
హిమముకంటెను నేను తెల్లగా నుండునట్లు నీవు నన్ను కడుగుము.

ప్రభువైన యేసయ్య! మీ కరుణాపీఠము నొద్దకు
వచ్చుటకు కూడా నేను అర్హుడను కాను. అయితే నీవు నా కోసం సిలువలో
చిందించిన పరిశుద్ధ రక్తమును బట్టి
నీ పాదముల చెంత సాగిలపడియున్నాను.
నీవు ఉన్నతమైన కృప ద్వారా నన్ను కనికరించండి.
అనేక పర్యాయములు నా తల్లిదండ్రులను దుఃఖపెట్టియున్నాను.
నా బంధువులను, నా స్నేహితులను బాధపెట్టియున్నాను.
యేసయ్యా, నన్ను క్షమించండి.

నా పాపమును బట్టి నేను దుఃఖాక్రాంతుడనై యున్నాను.
నా అవిధేయతను బట్టి భారమైన శ్రమలనుభవిస్తున్నాను.
దేవా! నీవు నాపట్ల దయచూపించని యెడల
ఎవరు నాపై దయచూపిస్తారు.
నీవు క్షమించని యెడల ఎవరు నన్ను క్షమిస్తారు.
నీ పరిశుద్ధ రక్తముతో నిలువెల్ల నన్ను కడిగి శుద్ధీకరించండి.
నాలో ఉన్న అపవిత్రతను తీసివేయండి.
నేను పవిత్రుడగునట్లు మీ రక్తముతో
నా హృదయమును శుద్ధీకరించండి. నా ఆత్మను శుద్ధీకరించండి.
నా మనసులో ఉన్న పాపపు కోరికలను తీసివేసి శుద్ధీకరించండి.

నేను నా తల్లి గర్భమున పుట్టినది మొదలుకొని ఈ క్షణము వరకు చేసిన
ప్రతి పాపమును, దుష్కార్యమును క్షమించండి.
తండ్రివైన దేవా! నేను ఎంతో ప్రయాసతో నా జీవితమును వెళ్లబుచ్చుచున్నాను.
పాపము నుండి నన్ను దూరపరచండి.
పరిశుద్ధ జీవితమును నాకు ప్రసాదించండి. నన్ను పరిపూర్ణుడిగా/
పరిపూర్ణరాలుగా తయారుచేయండి.
పాపపు దాస్యత్వములో నలిగిపోతున్న నన్ను
నీకిష్టమైన కుమారునిగా / నీకిఇష్టమైన కుమార్తెగా మార్చండి.
ఇక నా జీవితములో ఏ చిన్న పొరపాటు తప్పు,
పాపము చేయకుండా మీ ఆత్మతో నన్ను నింపండి.

పాపమునకు దూరముగాను, నీకు దగ్గరగాను జీవించే
అనుదిన వాత్సల్యతను, నీ కృపను మాకు దయచేయండి.

ఎవడైనను పాపము చేసినయెడల
నీతిమంతుడైన యేసుక్రీస్తు అను ఉత్తరవాది
తండ్రియొద్ద మనకున్నాడు.
ఆయనే మన పాపములకు శాంతికరమై యున్నాడు;
మన పాపములకు మాత్రమేకాదు.
సర్వలోకమునకును శాంతికరమై యున్నాడు.

అని 1 యోహాను 2:1,2 వ్రాయబడిన వాక్యమును బట్టి
యేసయ్యా! నా సమస్త పాపముల నుండి
నన్ను రక్షించడానికి తండ్రియొద్ద ఉత్తరవాదిగా
నీవున్నందులకు నీకు స్తోత్రములు.

జీవముగల నీ సంఘ సహవాసములో
క్రమముగా నడుచుకొనడానికి సహాయము చేయండి.
నాలో ఉన్న అవిధేయతను తీసివేయండి.
నీ శాశ్వతమైన రాజ్యంలో చేరువరకు
పరిశుద్ధముగా జీవించడానికి
కావలసిన వాక్య సందేశములను నేను విననట్లును,
ధ్యానించునట్లును సహాయము చేయండి.
ప్రార్థన ఆత్మను నాకు అనుగ్రహించండి.
నీ నిత్యరాజ్యములోనికి నేను చేరువరకు ప్రతి దినము
నీ రక్తముతో నన్ను శుద్ధీకరించండి;
నన్ను క్రమపరచి విశ్వాసములో స్థిరపరచండి;
అనుదిన జీవితంలో ఫలించి అభివృద్ధి పొందుటకు
మాకు కావలసిన 9 ఆత్మఫలములను ఇచ్చియున్నారు;
ఈ ఆత్మఫలములను మేము దిన దినం అభివృద్ధి చేసుకొనుట
సహాయము చేయండి.
దేవా! నీ దయ సంకల్పమును బట్టి నన్ను త్రోసివేయక,
నీ కృపలో ఈ పాపి ప్రార్థనలను ఆలకించమని
కృతజ్ఞతాస్తుతులు చెల్లించి
యేసు నామములోనే వేడుకొనుచున్నాము తండ్రీ. ఆమేన్...

సమకూర్పు:
దైవజనులు డా.. ఇమ్మానుయేలు సన్నిధి, ఎల్లాద్దాయి.